

రెవెన్యూ వినతులను త్వరగా పరిష్కరించాలి : జెసి

ప్రజాశక్తి-విజయనగరం కోట

రెవెన్యూ సదస్సుల్లో, రీ సర్వే గ్రామ సభల్లో నమోదైన వినతులను త్వరగా పరిష్కరించాలని సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిజిఆర్ఎస్, రెవెన్యూ, రీ సర్వే వినతులు, ఫ్రీ హోల్డు భూములు , పిఒఎల్ఆర్ తదితర రెవిన్యూ అంశాలపై మండలాల వారీ సమీక్షించారు. గత వారం రోజుల్లో రెవిన్యూ వినతుల ప్రోగ్రెస్ మెరుగైందని, రీ సర్వే వినతులు పరిష్కారంలో పురోగతి లేదని అన్నారు. గ్రామ సర్వేయర్లు, విఆర్ఒల సమన్వయంతో వేగంగా పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, కెఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ మురళి, నియోజకవర్గం ఇంచార్జ్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

వేలాదిగా తరలివచ్చిన భక్తులు

పట్టు వస్త్రాలు సమర్పించిన గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి

ఏర్పాట్లను పరిశీలించిన పిఒ, ఎస్‌పి

జాతరలో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి

'శంబర'ంగా జాతర

ప్రజాశక్తి- మక్కువ

ఉత్తరాంధ్రుల ఇలవేల్పుగా ప్రసిద్ధిగాంచిన శంబర పోలమాంబ అమ్మవారి సిరిమాను జాతర మంగళవారం వైభవంగా జరిగింది. సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. మంగళవారం వేకువ జామునుంచే అమ్మవారి దర్శనానికి ప్రజలు క్యూకట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు అనంతరం కుటుంబ సభ్యులతో లకిస అమ్మవారి ఫటాలను మోస్తూ మొక్కులు చెల్లించుకున్నారు మధ్యాహ్నం 3.30గంటలకు సిరిమాను సంబరం మొదలైంది. ఆలయ కమిటీ చైర్మన్ నైదాన తిరుపతిరావు , గ్రామ పెద్దల సమక్షంలో కమిటీ సభ్యులు పూజారి జన్ని పేకాపు రామారావును భుజాలపై మోసుకొని వచ్చి సిరిమాను అధిరోహింప చేశారు. తొలుత గిరడ వారి ఇంటి వద్ద పూజలు అందుకున్న అనంతరం అమ్మవారు నాయుడుగా పేరుందిన పూడి వారి ఇంటికి వెళ్లి పూజలు అందుకున్నారు. అనంతరం నడిమి వీధి మీదుగా ఎస్‌సి వీధి, పనుకువీధి, గొల్ల వీధి మీదుగా చావిడి వీధికి చేరుకున్నారు సాయంత్రం 6గంటలకు సిరిమానోత్సవం ముగిసింది. మారుజాతర వరకు చదురుగుడి వద్ద భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి మాధవరెడ్డి

సిరిమానోత్సవం సందర్భంగా ఏర్పాట్లను, బందోబస్తును ఎస్‌పి మాధవరెడ్డి అదనపు ఎస్‌పి దిలీప్‌కిరణ్, ఎఎస్‌పి అంకిత సురానతో కలిసి పరిశీలించారు. అంతకుముందు చావిడి వీధిలో సిరిమాను ఊరేగింపు కార్యక్రమాన్ని పోలీసు రోప్ పార్టీ బందోబస్తు నడుమ అదనపు ఎస్‌పి, ఎఎస్‌పి డ్రోన్ కెమెరాలతో నిశితంగా పరిశీలించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జాతర సందర్భంగా దేవాలయ శాఖ ఇఒ వివి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతి కార్యక్రమాలు డప్పు వాయిద్యాలు భక్తులను అలరించాయి.

జాతరలో ఆకట్టుకున్న విచిత్ర వేషాధారణలు

సాఫీగా అమ్మవారి దర్శనం

విశాలంగా ఏర్పాటు చేసిన క్యూలైన్లతో భక్తులు అమ్మవారిని సాఫీగా దర్శించుకున్నారు. ఏ విధమైన రద్దీ లేకుండా ప్రశాంతంగా నడుచుకుంటూ దర్శనానికి వీలు కల్పించారని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న అధికారులు

ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ్ పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. డిఎంఅండ్‌హెచ్‌ఒ భాస్కరరావు, ఎంపిడిఒ స్వరూపరాణి, తహశీల్దార్ ఇబ్రహిం, పలువురు అధికారులు అమ్మవారిని దర్శించుకుకున్నారు.

జాతరలో అపశృతి ..నలుగురికి గాయాలు

సినిమాను ప్రారంభ సమయంలో నాయుడు వారి ఇంటికి సినిమాను చేరుకున్న తరుణంలో స్వల్ప అపశృతి చోటు చేసుకుంది. అమ్మవారిని నేరుగా దర్శించుకునేందుకు పూడి వెంకటరమణ ఇంటి మెట్లు ఎక్కిన భక్తులు ఒక్కసారిగా పిట్టగోడ పైకి రావడంతో గోడ కూలిపోయింది. ఈ ఘటనలో గజపతినగరం మండలం కొత్త బగ్గాంకు చెందిన పొందూరు జగదీష్‌కు గాయమైంది. కందులపదం గ్రామానికి చెందిన కొండ రామకృష్ణకు కూడా గాయాలయ్యాయి. వీరికి స్థానిక ఆసుపత్రిలో వైద్యులు చికిత్స అందజేశారు.

పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డిజిపి ద్వారక తిరుమలరావు

నేరాల నియంత్రణకు చర్యలు

- డిజిపి సిహెచ్ ద్వారక తిరుమలరావు
- మాదక ద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన 'సంకల్పం' స్ఫూర్తిదాయకం
- గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రజాశక్తి-విజయనగరంకోట

నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను రాష్ట్ర డిజిపి సిహెచ్ ద్వారక తిరుమలరావు అన్నారు. పోలీసుశాఖలో ఏర్పాటు చేస్తున్న సిసి కెమెరాలు, డ్రోన్లు ద్వారా మెరుగైన ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించి, జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశమై, శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ చేపట్టిన చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ నేరాలు నమోదైన తరువాత వాటిని ఛేదించుట కంటే నేరాలు జరగకుండా నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని డిజిపి ఆదేశించారు. రాష్ట్రంలో గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టి, గంజాయి అక్రమ రవాణను అరికట్టామని, ఆయా కేసుల్లో కీలకంగా ఉన్న నిందితులను అరెస్టు చేసి, గంజాయిపై ఉక్కుపాదం మోపామని తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్ చేపట్టిన 'సంకల్పం' కార్యక్రమం అందరికి స్ఫూర్తిదాయకమన్నారు. సైబరు మోసాలు, రహదారి భద్రత, మాదక ద్రవ్యాల పట్ల అవగాహన కల్పించేందుకు యువతను, ప్రజలను చైతన్యపర్చేందుకు ప్రత్యేకంగా 'సంకల్ప రథం'తో జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి, జిల్లా పోలీసు శాఖకు, రాష్ట్రానికి మరింత మంచి పేరును తీసుకొని రావాలన్నారు. నేరాల నియంత్రణలో సాంకేతికతను వినియోగించి, నేరాలకట్టడికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలను పారదర్శకంగా అందించాలన్నారు. విజిబుల్ పోలీసింగుకు ప్రాధాన్యతనివ్వాలని, నేరాలను నియంత్రిస్తూ, గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు పోలీసు అధికారులంతా పని చేయాలని డిజిపి పిలుపునిచ్చారు.

ఎస్‌పి వకుల్ జిందల్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాలను నియంత్రించేందుకు జిల్లా పోలీసుశాఖ చేపట్టిన చర్యలను, వివిధ నేరాలను ఛేదించడంలో పోలీసులు చేసిన కృషిని పవర్ పాయింట్ ప్రజెంటేషను ద్వారా డిజిపికి వివరించారు. మహిళలపై జరిగిన దాడులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి, ఆయా కేసుల్లో నిందితులకు శిక్షపడేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో విశాఖ రేంజ్ డిఐజి గోపినాథ్‌జట్టి, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్‌పి ఎస్‌వి మాధవ్‌రెడ్డి, కమాండెంట్ మాలిక గార్గ్, ఎఆర్ అదనపు ఎస్‌పి జి. నాగేశ్వరరావు, డిఎస్‌పిలు, పి.శ్రీనివాసరావు, డి.భవ్యరెడ్డి, ఎస్.రాఘవులు, యూనివర్స్, రాంబాబు, పలువురు సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికల్యాణ్ చక్రవర్తి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

మధ్యవర్తిత్వం ద్వారా కేసులను సులభంగా పరిష్కరించుకోవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్ చక్రవర్తి అన్నారు. సుప్రీకోర్టు మీడియేషన్ కౌన్సిలేషన్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కోర్టు సముదాయంలో ఉమ్మడి జిల్లా న్యాయవాదులకు, రిటైర్ట్ న్యాయాధికారులకు, సామాజిక కార్యకర్తలకు 40 గంటల మధ్యవర్తిత్వ శిక్షణా కార్యక్రమంలో భాగంగా మంగళ వారం ఆయన మాట్లాడారు. మధ్యవర్తిత్వంలోని మెలకువలను నేర్చుకోవడం ద్వారా కేసులను చాలా సులభంగా పరిష్కరించవచ్చునని, అందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. వ్యాజ్యాలను మానవతా దృక్పథంతో పరిశీలించి ఉభయ పార్టీల ద్వారానే పరిష్కారం రాబట్టాలని న్యాయవాదులకు సూచించారు. ఈ మధ్యవర్తిత్వం వల్ల ఉభయ పార్టీలకు సమయం డబ్బు వృథా కాకుండా ఉంటాయన్నారు.కోర్టులో చాలా కాలంగా పెండింగ్లో ఉన్న కేసులకు పరిష్కారం చూపవచ్చునని అన్నారు. వ్యాజ్యాల పరిష్కారానికి రాజీ కూడా ఒక మార్గమేనని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి టివి రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాలకు నీటి సరఫరా బంద్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తాటిపూడి రిజర్వాయర్ పరిధిలో మధుపాడ పంపింగ్ లైన్ అయ్యన్నపేట దగ్గర లీకైన కారణంగా నగరంలోని కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బొగ్గుల దిబ్బ, అంబేద్కర్ కాలనీ,ఎల్బీ కాలనీ, పోలయ్య పేట, కుసుమ గజపతి నగర్, వివేకానంద కాలనీ, సాలిపేట, ఆదిత్య నగర్, బొబ్బాది పేట, మహాలక్ష్మి నగర్, సూర్య నగర్ ప్రాంతాలలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. నీటి పంపిణీ జరగని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంకుల ద్వారా నీటి పంపిణీ చేస్తామని తెలిపారు.

ఇవిఎం గోదాములు తనిఖీ

నెల్లిమర్ల : నెల్లిమర్లలోని ఇవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మంగళవారం తనిఖీ చేశారు. షట్టర్లకు వేసిన సీళ్లను, సిసి కెమేరాలను పరిశీలించారు. సిసి కెమేరా ఫీడ్ ను ప్రతీ 15 రోజులకోసారి భద్రపరచాలని సూచించారు. కలెక్టర్ వెంట డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ డి.కీర్తి, తాహశీల్దార్ సుదర్శన్, ఎన్నికల సూపరింటిండెంట్ భాస్కరావు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యాన కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వివిధ కాలనీల ప్రజలు

కుళాయి కనెక్షన్లు వేయాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని రామకృష్ణా నగర్, ఎల్‌బిజి నగర్, అయ్యప్ప నగర్, తోటపాలెం వైఎస్ఆర్ నగర్ లో మంచినీటి కుళాయిలు వేయాలని కోరుతూ మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ, పేదలు, మధ్యతరగతి ప్రజలు నివాసం ఉంటున్న ఈ ప్రాంతాలలో కుళాయి కనెక్షన్లు మంజూరు చేయక పోవడంతో అక్రమ వాటర్ ప్లాంట్లు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి కుళాయిలు వేస్తామని చెబుతున్నదని, కాలనీలకు రూ.200కే కుళాయి కనెక్షన్లు మంజూరు చేయాలని కోరారు. గురజాడ నగర్, వినాయక నగర్ లోని ప్రజలకు ట్యాంక్ ద్వారా నీరు సరఫరా చెయ్యాలని, బోర్లు వేయాలని కోరారు అనంతరం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, బి.రమణ, వి. లక్ష్మి, ఎం.జగ దాంబ, శాంతమూర్తి పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి రూ.50వేల కోట్లు కేటాయించాలి

- సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని
- రాష్ట్ర మహాసభల గోడ పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తరాంధ్ర అభివృద్ధికి రూ.50వేల కోట్లు కేటాయించాలని, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని కోరుతూ భవిష్యత్తులో పోరాటాలు నిర్వహించేందుకు ఫిబ్రవరి 1 నుండి 3 రోజులు పాటు నెల్లూరులో జరిగే రాష్ట్ర మహాసభల్లో సిపిఎం పార్టీ కర్తవ్యంగా తీసుకోనుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తెలిపారు. స్థానిక ఎల్‌బిజి భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర మహాసభల గోడ పత్రికను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తర్వాత ఉత్తరాంధ్ర జిల్లాలు పూర్తిగా వెనుకబడి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జిల్లాల అభివృద్ధికి రూ.50 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకు ఉపాధి నిచ్చే స్టీల్ ప్లాంట్ కు ప్రభుత్వం సొంత గనులు కేటాయించకుండా కార్పొరేట్ వ్యక్తులకు కారు చౌకగా కట్టబెట్టాలని కుట్రలు చేసిందని, స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి రక్షించాలని కోరారు. జిల్లాలో గిరిజన యూనివర్సిటీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని, వేపాడ, మెంటాడ, ఎస్ కోట మండలాలతో కలుపుకొని ఐటిడిఎ ఏర్పాటు చేయాలని, గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయాలన్నారు. వీటన్నింటి సాధన కోసం పోరాటాలు చేసే విధంగా సిపిఎం రాష్ట్ర మహాసభల్లో నిర్ణయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, రెడ్డి శంకర్రావు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఆంధ్ర రాష్ట్ర పునర్విభజన చట్టం ఆధారంగా ఉత్తరాంధ్ర అభివృద్ధికి రూ.50 వేల కోట్ల రూపాయల నిధిలిచ్చి, పెండింగ్ నీటి ప్రాజక్టులను పూర్తి చేయాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస లేఖ రాశారు. ఆ లేఖను మంగళవారం పత్రికలకు విడుదల చేశారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌లో ఉత్తరాంధ్రకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఆంధ్ర రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక నిధులు ఇచ్చి అభివద్ధి చేయాల్సి ఉన్నా, ఈ పదేళ్ళ కాలంలో కేంద్రం ఇచ్చిన నిధులు ఒక్కో జిల్లాకు నామమాత్ర 100 కోట్ల రూపాయలు మాత్రమేనని తెలిపారు. ఉత్తరాంధ్ర నీటి ప్రాజక్టుల సత్వర నిర్మాణానికి 50 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని కోరారు.

రైల్వే జోన్ ఆఫీసుల నిర్మాణం పూర్తయేలోగా వెంటనే తాత్కాలిక భవనాల నుండి పాలన ప్రారంభించాలన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు.

కనీస పెన్షన్ రూ.9వేలు చెల్లించాలి

కనీస పెన్షన్ కోసం 11,12,13 తేదీల్లో చలో పార్లమెంట్ : సదస్సులో వక్తలు పిలుపు

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఇపిఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని, లేకుంటే ఫిబ్రవరి 11,12,13 తేదీల్లో చలో పార్లమెంట్ నిర్వహించి ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం కావాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు పిలుపునిచ్చారు. మంగళ వారం ప్రజా సంఘాల కార్యాలయంలో ఆ అసోసియేషన్ ఆధ్వర్యాన జిల్లా స్థాయి సదస్సు జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు అధ్యక్షతన జరిగిన ఈసదస్సులో సత్తిరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసగించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఇపిఎస్ 95 పెన్షనర్ల కనీస పెన్షన్ పెంచడంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 36లక్షల మంది కనీస పెన్షన్ వెయ్యి రూపాయలు కూడా పొందలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. అదే విధంగా హయర్ పెన్షన్ కోసం 15 లక్షల మంది దరఖాస్తు చేస్తే నేటికీ అవి పరిష్కారానికి నోచుకోలేదని విమర్శించారు. పెన్షనర్లకు ఫిబ్రవరి 1వ తేదీన ప్రకటించే బడ్జెట్లో కనీస పెన్షన్ రూ.9వేలు ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే ఫిబ్రవరి 11, 12, 13 తేదీల్లో ఢిల్లీలో పోరాట కార్యక్రమం నిర్వహిస్తామని, మార్చిలో రైల్‌రోకోలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్ పాల్గొని ప్రసంగించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నాయులు ఎ.గౌరినాయుడు, వి.శేషగిరి, కె.రామారావు, జె.రామారావు తదితరులు పాల్గొన్నారు.అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవా ధ్యక్షులుగా పి. శంకర్రావు , అధ్యక్షులుగా జె. విశ్వనాథరాజు, కార్యదర్శిగా ఒఎస్ఎన్ హుస్సేన్, కోశాధికారిగా ఎ.గౌరినాయుడు పదిమంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

మాట్లాతున్న ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు

నగరంలో కోడిరామ్మూర్తి చిత్రపటంతో నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

ఘనంగా కోడి రామ్మూర్తి ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కలియుగ భీముడు కోడి రామమూర్తి నాయుడు ఆరాధనోత్సవాలు కోడి రామమూర్తి వ్యాయామ సమాజం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.య ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమాజం నిర్వాహకులు పెద్ది లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బెంగుళూరుకు చెందిన బి.ప్రవీణ్ వేగంగా వెళ్తున్న కారును ఆపి అందరి ప్రశంసలూ అందుకున్నారు. 150 కిలోమీటర్ల వేగవంతమైన రెండు వ్యతిరేక దిశలో పయనించే బైకులను అదుపు చేసి ఆపిన ధనరాజ్ ప్రతిభను ఎమ్మెల్యే కొనియాడారు. అనంతరం జరిగిన సభలో ఈ ఇద్దరు క్రీడా,వ్యాయామకారులను, జాతీయ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి మత్స సంతోషి, ఏషియన్ సబ్ జూనియర్ గోల్డ్ మెడలిస్ట్ ఉషను సత్కరించారు. కోడి రామ్మూర్తిని ఆదర్శంగా తీసుకుని ఇక్కడ వ్యాయామకారులు పెద్ది లక్ష్మీనారాయణ ఎందరో శిష్యులను తీర్చిదిద్దడం పట్ల అభినందనలు తెలిపారు. ఇక్కడ స్పోర్ట్స్ స్కూల్‌లో విలువైన శిక్షణ పొందిన వారు ఉన్నారని , క్రీడా యునివర్సిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతామని తెలిపారు. అనంతరం కోడి రామమూర్తి చిత్రపటంతో నగరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సమాజ సేవకుడు పల్లంట్ల రామారావు కోడి రామమూర్తి చేసిన సేవలను ప్రస్తుతించారు. పలువురు చిన్నారులు కత్తి స్వాము , పలు సహస విద్యలు ప్రదర్శించి అందర్నీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పెనుమజ్జి విజయలక్ష్మి, ఎన్‌సిసి విద్యార్థులు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్ఎంఎస్‌కు ఇద్దరు విద్యార్థులు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్ బి.శంకర్

ప్రజాశక్తి-విజయనగరం

దేశంలోనే ప్రతిష్టాత్మకమైన రాష్ట్రీయ మిలటరీ స్కూలు ఆరో తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాల్లో నగరంలోని ఉడాకాలనీలోగల శ్రీసాయి సరస్వతి కోచింగ్ సెంటర్, కామాక్షినగర్‌లోని శ్రీ వెంకటేశ్వర విద్యానికేతన్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. పాల్‌నగర్ రోడ్డులో ఉన్న శ్రీ సాయి సరస్వతి కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకొంటున్న సుందర్ హేమంతవీర్ ఈ ఏడాది జరిగిన రాష్ట్రయ మిలిటరీ స్కూల్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాడు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని ఆ సంస్థ డైరెక్టర్ బి.శంకర్ అభినందించారు. తమ సంస్థ ద్వారా ఇంతవరకు చాలా మంది విద్యార్థులు నవోదయ, సైనిక, ఆర్ఎమ్ఎస్ తదితర ప్రవేశ పరీక్షల్లో ఎంపికై మంచి స్థాయిలో ఉన్నారని, ఇంతటి విజయానికి కారణమైన తల్లితండ్రులకు. టీచింగ్ స్టాఫ్‌కు విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు. వెంకటేశ్వర విద్యానికేతన్‌లో శిక్షణ పొందిన విద్యార్థి గంటా ఖద్యోత్‌జైకర్‌కు ఆ సంస్థ డైరెక్టర్ వాసు అభినందించారు.

ముగిసిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సదస్సు

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉడాకాలనీలో నిజన శిక్షణా సంస్తాన్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల ఐదురోజుల అవగాహన సదస్సు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఒక వ్యాపారాన్ని ఎలా ఎంచుకోవాలి, ఎలా ప్రారంభించాలి, ఎలా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. పరిశ్రమలశాఖ జిఎం ఎంవి కరుణాకర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు ఎలా పొందాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. లీడ్‌బ్యాంకు మేనేజర్ వివి రమణమూర్తి రుణాలు, రాయతీలు గురించి వివరించారు. జిల్లా పర్యాటక శాఖ అదికారి కె.కుమార స్వామి జిల్లా పర్యాటక రంగంలో పారిశ్రామకవేత్తగా ఎలా ఎదగాలో వివరించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి జి.ప్రశాంత్ కుమార్, జన శిక్షణా సంస్తాన్ డైరెక్టర్ వడ్డాది హరీష్ మాట్లాడుతూ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు

పన్నుల వసూలు వేగవంతం చేయాలి

బొబ్బిలి: మున్సిపాలిటీలో పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. పట్టణంలోని కుమ్మరివీధి వార్డు సచివాలయాన్ని మంగళవారం పరిశీలించారు. ఆస్తి పన్ను, కుళాయి పన్ను వసూలు వేగవంతం చేయాలన్నారు. ఎసెస్‌మెంట్ వారీగా సమీక్ష చేసి పన్ను వసూలుపై మార్గదర్శకాలు జారీ చేశారు. పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెతో ఆర్ఒ నాగరాజు, నోడల్ అధికారి సింహాచలం, సిబ్బంది ఉన్నారు.

జీతాల్లేక గ్రీన్ అంబాసిడర్ల కటకట

తెర్లాం: మండల కేంద్రంలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు 18 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కటకటలాడుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి గోపాలం అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం ఎంపిడిఒ ఆర్ రాంబాబుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గోపాలం మాట్లాడుతూ 18 నెలలుగా పనిచేస్తున్నారని పండగలకి పూట కూడా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే సదరు పంచాయతీ కార్యదర్శులకు జీతాలివ్వాలని ఆదేశించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 30 మంది ఎంపిక

కొత్తవలస: విద్యుంపేట పిహెచ్‌సి పరిధిలో గల 8 సచివాలయాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించి, స్క్రీనింగ్ చేసి 30 మందిని ఉచిత కేటరాక్ట్ ఆపరేషన్లకి ఎంపిక చేసి శ్రీ వెంకటేశ్వర పుష్ప గిరి కంటి ఆసుపత్రికి బస్సులో పంపించినట్లు డాక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. వీరిని ఎంపిక చేసిన ఆప్తాల్మిక్ ఆఫీసర్ సి.హెచ్. ఈశ్వరరావు మాట్లాడుతూ అందరికీ బీపీ, షుగర్, ఇసిజి చేసి ఆభా, రేషన్ కార్డు, ఎన్‌టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేస్తారని తెలిపారు. ఉచితంగా రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు చేసి ఉచిత భోజన సదుపాయం కల్పించి ఆపరేషన్ తర్వాత మళ్లీ వీరిని ఉచిత బస్సు ద్వారా ఇంటికి చేరుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎఎన్ఎమ్ వరలక్ష్మి, జ్యోతి, తులసి, లక్ష్మి, ఆశ వర్కర్స్ రేవతి, విజయలక్ష్మి, రామలక్ష్మి, వెంకటలక్ష్మి, కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఒఎస్‌కు సన్మానం

రేగిడి: తహశీల్దార్ కార్యాలయంలో ఒఎస్‌గా పనిచేసిన రామారావుకు జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నుంచి ఉత్తమ అవార్డు పొందినందుకు రెవెన్యూ అధికారులు మంగళవారం సన్మానం చేశారు. తహశీల్దార్ చిన్నారావు, సీనియర్ అసిస్టెంట్ మురళి, ఆర్ఐ రేవతి, వీఆర్వోల సంఘం నాయకులు సాలువాలతో ఘనంగా సన్మానించారు. నిబద్ధతతో ఒఎస్‌గా విధులు నిర్వహించి మంచి గుర్తింపు తెచ్చుకున్నందుకు అవార్డు దక్కిందని కొనియాడారు.

టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు

రేగిడి: మండలంలోని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అంబాడ వెంకటాపురం గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పనితీరును జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీలు మంగళవారం నిర్వహించింది. ఈ తనిఖీల్లో గర్భిణులకు వైద్య పరీక్షలు, విద్యార్థులకు హెచ్‌బి వంటి పరీక్షలతో పాటు రికార్డులు పరిశీలించారు. ఎమ్ఎల్‌హెచ్‌పి, ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్తల రికార్డులు, పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిపిహెచ్‌ఎన్ఒ సత్యవతి, గణాంకాధికారి ధర్మారావు, డిపిఒ రామానుజులనాయుడు, ఎంఐఎస్ శ్రీనివాస్ విస్తరణ అధికారి రాధాకృష్ణ, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

గుండెపోటుతో ఎమ్మెల్యే 'కళా' సోదరుడు మృతి

రేగిడి: చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు సోదరుడు ప్రముఖ పారిశ్రామికవేత్త కిమిడి సత్యన్నారాయణనాయుడు(82) గుండెపోటుతో మృతి చెందారు. అస్వస్థత కారణంగా విశాఖలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. విశాఖ నుంచి స్వగ్రామం రేగిడి పార్థివదేహాన్ని తీసుకువచ్చారు. బుధవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే కళా వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతిరావు, మాజీ జెడ్‌పిటిసి కిమిడి రామకృష్ణంనాయుడు, మాజీ మంత్రి కిమిడి మృణాళిని స్వగ్రామానికి చేరుకున్నారు. సత్యనారాయణ నాయుడు మృతి పట్ల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నాయకులు నివాళులర్పించారు.

కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక

గజపతినగరం: మండలంలోని పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎన్నికైంది. ఎంపిడిఒ బి.కళ్యాణి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షులు మంత్రి రమణ, ఉపాధ్యక్షులు కర్రీ పార్థునాయుడు, కార్యదర్శి దసన రోషలీన, జాయింట్ కార్యదర్శి బెహర రమ్య, కోశాధికారి గంగుల తాతారావులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పశువైద్య శిబిరానికి విశేష స్పందన

బాడంగి: మండలంలోని లక్ష్మీపురంలో మంగళవారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని పశువైద్యాధికారి సతీష్ కుమార్‌నాయుడు అన్నారు. పాడి పశువులకు వస్తున్న వ్యాధులను నివారించేందుకు ప్రభుత్వం వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో మిమ్స్ విద్యార్థి ప్రతిభ

నెల్లిమర్ల: జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మిమ్స్ ఫిజియో థెరఫీ విద్యార్థి ప్రతిభ కనబర్చారు. మిమ్స్ ఫిజియో థెరఫీ విద్యార్థి ఆర్. వందన ఈ నెల 19 నుంచి 22 వరకు ఛతీష్‌ఘడ్‌లో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఆమెను మిమ్స్ చైర్మన్ అల్లూరి సత్యనారాయణ రాజు, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ప్రవీణ్ వర్మ, డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్, మెడికల్ డైరెక్టర్ రఘు రాం, అకడమీక్ డైరెక్టర్ డాక్టర్ వేణుగోపాల్‌రావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రావు, ఫిజియో థెరఫీ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కుమార్, వ్యాయామ అధ్యాపకులు కళా వెంకట్రావు, మిమ్స్ ఎఒ పి.గణేష్, తలిదండ్రులు లక్ష్మీ గాయత్రి,శంకరరావు, కోచ్ మహేష్ సిబ్బంది మంగళశారం ఆమెను అభినందించారు.

హోరాహోరీగా ఎడ్ల పరుగు పందెం

ప్రజాశక్తి - వేపాడ

పోటీలో పెరిగెడుతున్న ఎడ్ల బండి

మండలంలోని బల్లంకిలో శ్రీమరిడిమాంబ జాతర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు ప్రదర్శన హోరాహోరీగా జరిగింది. 16 ఎడ్ల బళ్ళు పాల్గొని తలబడ్డాయి. ఈ పరుగు ప్రదర్శనలో విజేతగా నిలిచిన మొదటి ఎడ్ల బండి యజమానికి గొంప వెంకటరావు, తులసి దంపతులు ఆర్థిక సహాయంతో రూ.12వేలు, రెండో బహుమతి రూ.10వేలు, మూడో బహుమతి రూ.8వేలు నాలుగో బహుమతి రూ.6వేలు అందించారు. ఈ బహుమతులను ఎంపిటిసి గొంప తులసి, గ్రామ పెద్ద బల్లంకి కనకరావు, ఉప సర్పంచ్ ధనుంజయ, పాలకవర్గ సభ్యులు, చేతుల మీదుగా అందించారు.

మండల కేంద్రంలో మంగళవారం శ్రీముత్యాలమ్మ తీర్థ మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన టైరు బండ్ల ఎడ్ల ప్రదర్శనలో విజేతగా నిలిచిన మొదటి బండి యజమానికి రూ.5వేలు, రెండో బహుమతి రూ.3వేలు సర్పంచ్ ఎం. అర్జునమ్మ, ఎంపిటిసి గంగ తల్లి, ఉత్సవ కమిటీ సభ్యులు చేతుల మీదుగా అందజేశారు.

గుండె పోటుతో అలమండ కార్యదర్శి మృతి

జామి: మండలంలోని అలమండ పంచాయతీ కార్యదర్శి సురేంద్ర కుమార్(51) గుండె పోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. విజయనగరం పట్టణంలో నివాసముంటున్న సురేంద్రకు తెల్లవారు జామును గుండె పోటు రావడంతో స్థానిక ప్రయివేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించినా, ఫలితం లేకపోయింది. సురేంద్ర మృతి కుటుంబ సభ్యులతో పాటు అలమండ ప్రజలకు, తోటి ఉద్యోగ సిబ్బందిని దిగ్భ్రాంతికి గురి చేసింది. సురేంద్రకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల కార్యదర్శుల సంఘం నాయకులు, సచివాలయం సిబ్బంది సంతాపాన్ని తెలియజేశారు.

రైలు ఢీకొని మహిళ మృతి

బొండపల్లి: రైలును ఢీకొన్న సంఘటనలో బొండపల్లి గ్రామానికి చెందిన నమ్మి గౌరి (68) మృతి చెందింది. ఈ నెల 24న గౌరి దినసరి వేతనం కోసం రైల్వే పనులలో భాగంగా ద్వారపూడి రైల్వే లైన్ సమీపంలో తుప్పలు తొలగించడంలో నిమగ్నమైంది. ఈ నేపథ్యంలో విజయనగరం నుండి రాయఘడ వెళ్తున్న రైలు ద్వారం గేటు ఆమెకు తగలడంతో తీవ్రంగా గాయపడిది. వెంటనే చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మంగలవారం మృతి చెందింది. మృతిరాలి కుమారుడు సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొబ్బిలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐసిడిఎస్‌ను క్రమబద్ధీకరించాలి

ప్రజాశకి-విజయనగరం టౌన్, గజపతినగరం, నెల్లిమర్ల

ఐసిడిఎస్‌ను క్రమబద్ధీకరించి, అంగన్వాడీ కార్యకర్తలకు, ఆయాలకు గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రపతికి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కార్యకర్తలు వ్యక్తిగత దరఖాస్తులు పంపేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం విజయనగరం అర్బన్ అండ్ రూరల్, గజపతినగరం, నెల్లిమర్ల సెక్టార్ మీటింగ్‌లు సందర్భంగా వ్యక్తి గత దరఖాస్తులు రాసి పోస్టల్ ద్వారా రాష్ట్రపతికి పంపారు. విజయనగరంలో ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు ప్రభావతి, విశాలాక్షి మాట్లాడుతూ బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఐసిడిఎస్ ఏర్పాటై యాభై ఏళ్లయ్యిందని,ఈ నేపథ్యంలో ఐసిడిఎస్‌ను క్రమబద్ధీకరించి , బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలన్నారు. దశాబ్దాలుగా సర్వీస్ అందిస్తున్న వర్కర్లకు, హెల్పర్లకు కనీస వేతనం రూ.26వేలు అమలుతో పాటు, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం గ్రాడ్యుటి చెల్లించే విధంగా గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలువురు సెక్టార్ లీడర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రపతికి అంగన్వాడీల దరఖాస్తులు

విజయనగరం: దరఖాస్తులను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గజపతినగరం : ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీలు రాసిన దరఖాస్తులను ప్రదర్శించారు. వీటిని రాష్ట్రపతికి పంపుతున్నట్లు యూనియన్ సెక్టార్ నాయకులు డి.సౌజన్య, సూర్య కుమారి, ఆర్ నారాయణమ్మ, టి.త్రివేణి తెలిపారు. కార్యక్రమంలో సన్యాసమ్మ, నాగమణి, జ్యోతి, టి.సన్యాసమ్మ, అన్నపూర్ణ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : నెల్లిమర్ల సెక్టార్ సమావేశంలో యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు మంగవేణి మాట్లాడారు. ఐసిడిఎస్‌ను సంస్థాగతం చేసి గ్రాట్యుటీ అమలు చేయాలని కోరుతూ రాష్ట్రపతికి దరఖాస్తులు పంపుతున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశకి-విజయనగరం టౌన్

సాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో సత్తెమ్మతల్లి హెల్ప్ లైన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్ఆర్ నగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిభిరాన్ని జనసేన నాయకులు అవనాపు విక్రమ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థోపెడిక్ డాక్టర్‌గా విశేష ఖ్యాతి గడించిన డాక్టర్ శ్రీరామమూర్తి తన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా పేదలకు విశేషమైన వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు, మందులు కూడా అందజేశారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు కూడా చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సత్తెమ్మ తల్లి హెల్ప్ లైన్ అధ్యక్షులు ఎం.ఉమామల్లికార్జునరావు, కార్యదర్శి ఎంపివిఎల్ నరసింహమూర్తి, ట్రెజరర్ వి.వెంకటేశ్వర్లు, సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' అవినీతి నిగ్గు తేలేనా ?

- పనులకు వెళ్లకుండా మస్తర్లు
- సామాజిక తనిఖీ నివేదికపై అందరి చూపు
- నేడు ప్రజావేదిక

ప్రజాశక్తి - జామి

మండలంలో గ్రామీణ ఉపాధి పనుల్లో భారీ అవినీతి చోటు చేసుకుందన్న ఆరోపనులు నేపథ్యంలో 18 సామాజిక తనిఖీ ప్రజా వేదికపై సర్వత్రా ఆశక్తి నెలకొంది. ప్రధానంగా జామి మేజరు పంచాయతీలో పనులకు వెళ్లకుండానే మస్టర్లు వేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అందులో భాగంగానే మస్టర్లు అవినీతిపై అధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. ఈ నేపథ్యంలోనే సామాజిక తనిఖీ బృందాలు ఆడిట్ నిర్వహించాయి. ఇప్పటికే గ్రామ సభల్లో బాహాటంగానే అవినీతిపై ప్రజలు ఆవేదన వెళ్ళబుచ్చారు. వీటన్నింటిపైన సామాజిక తనిఖీ బృందాలు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టిన తరుణంలో నేడు ప్రజా వేదికలో వాటిని బహిర్గతం చేయనున్నారు. ఈ నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

మండలంలో ఎస్.కోట నియోజకవర్గంలో 12 పంచాయతీలు, గజపతినగరం నియోజకవర్గంలో 13 పంచాయతీలతో మొత్తం 25 పంచాయతీల్లో 13,000 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 10,120 యాక్టివ్ జాబ్ కార్డులు ద్వారా 13,948 మంది పనులు చేస్తున్నారు. ఏటా సుమారుగా 7 లక్షలకు పైగా పని దినాలు నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో 18వ సామాజిక తనిఖీల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి మధ్య ఉపాధి పనులకు గానూ, రూ.16 కోట్లకు సంబంధించిన నిధుల ఖర్చుపై సామాజిక బృందాలు కొద్ది రోజులు పాటు గ్రామాల వారీగా పరిశీలన చేశాయి. వాటి నివేదికను సామాజిక ప్రజా వేదికలో నివేదించి, అక్రమాలపై చర్యలకు సిఫార్సు చేస్తారు. ఈ నేపథ్యంలోనే మస్టర్ల అవినీతిపై గంధరగోళం నెలకొనే అవకాశం ఉందని అంచనా. ఇప్పటికే కొంత మంది అధికారులకు, సమాచార చట్టం ద్వారా కొంత అవినీతిని బయటపెట్టిన విషయం తెలిసిందే. దీనిపై ప్రజావేదికలో ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిన పరిస్థితి. అందులో భాగంగా పనులకు వెళ్లకుండా మస్టర్లు వేశారన్న ఆరోపణలపై ఉపాధి హామీ ఎపిఒ కిరణ్మయిని ప్రజాశక్తి వివరణ కోరగా, ప్రజావేదికలో అన్ని బహిర్గతం అవుతాయని, తానేమీ చెప్పలేనని అన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - చీపురుపల్లి

చీపురుపల్లి సర్కిల్ పరిధిలో రెండు మద్యం దుకాణాలు మంజూరయ్యాయని వాటికి సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని చీపురుపల్లి ఎక్సైజ్ సిఐ సిహెచ్ చక్రవర్తి తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఎస్ఐ గిరీష్‌తో కలిసి విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడారు. సర్కిల్ పరిధిలోని మెరకముడిదాం మండలంలో మంజూరైన షాపు యాత కులస్థులకు, గరివిడి మండలానికి మంజూరైన షాపు శ్రీశైన కులస్తులకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ రెండు షాపులకు సంబంధించి ఫిబ్రవరి 5వ తేదీ లోపల దరఖాస్తులు ఆన్ లైన్‌లో చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు కుల దృవీకరణ పత్రం, రూ.2లక్షలు అప్లికేషన్ ఫీజు చెల్లించాలన్నారు.

కొత్తవలస: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్లుగీత (యాత) కులాలకు రిజర్వేషన్ ప్రాతిపదికన, జిల్లా యూనిట్‌గా ఒక మద్యం షాప్ కేటాయించామని ఎక్సైజ్ సిఐ రాజశేఖర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీలోపు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తు అందజేయాలని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు తమను సంప్రదించాలని కోరారు.

గజపతినగరం: కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం గజపతినగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గజపతినగరం మండలానికి ఒక మద్యం దుకాణం యాత కులస్తులకు కేటాయించిందని ఎక్సైజ్ సీఐ జే.జనార్ధన్‌రావు అన్నారు. ఆసక్తి కలిగిన వారు స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో కానీ, ఆన్ లైన్ విధానంలో కాని, దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు రుసుము రెండు లక్షల రూపాయలు చలానా రూపంలో ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. కుల, స్వస్థల నిర్ధారిత ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు.

నేడు ప్రభుత్వ ఐటిఐలో జాబ్ మేళా

ప్రజాశక్తి- రాజాం

పట్టణంలోని శ్రీకాకుళం రోడ్డు ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో బుధవారం జాబ్ మేళాను ప్రిన్సిపల్ బి. భాస్కర్ రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్య అధికారి ప్రశాంత్ తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు అర్హులన్నారు. ఈ జాబ్ మేళాకు ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హెట్రో లాబ్స్, శ్రీరామ్‌లైఫ్ ఇన్సూరెన్స్, ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంకు మొదలగు బహుళ జాతి కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. 18-35 ఏళ్లలోపు ఉన్నవారు అర్హులని చెప్పారు. ఈ మేళలో పాల్గొనే అభ్యర్థులు http://naipunyam.ap.gov.in వైబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, అడ్మిట్ కార్డుతో పాటు రెస్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్, ఒక పాస్ ఫోటో సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. అర్హులైన అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 7286042743, టోల్‌ఫ్రీ 9988853335లను సంప్రదించాలని కోరారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - జామి

మండలంలోని బీమసింగి గ్రామానికి చెందిన దళిత వాడల్లో మౌలిక సదుపాయలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. మంగళవారం బీమసింగి దళిత, రెల్లి అవాశాల్లో సదుపాయాల కోసం ముందుగా ఎంపిడిఒ అప్పలనాయుడుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు, సిపిఎం నాయకులు మద్దిల రమణ మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రం వచ్చి 78 ఏళ్ళు కావస్తున్నా పాలకులు ఈ దళితులకు నేటికీ మౌలిక సౌకర్యాలు కల్పించలేదన్నారు. తాగునీరు సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, సిసి రోడ్లు సౌకర్యం డ్రైనేజీ కాలువల సౌకర్యం ఏమీ లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ఇల్లు స్థలాలు ఉన్నవారికి హౌసింగ్ స్కీంలు మంజూరు చేయాలని, దళితులు నివసిస్తున్న నివాస ప్రాంతాల వద్ద తాగునీరు బోరు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డప్పు కళాకారులుగా అర్హత ఉన్నప్పటికీ వీళ్ళలో కొందరికి పింఛను మంజూరు చేయలేదన్నారు. సమస్యలన్నీ పరిష్కరించాలని అధికారులు ప్రజాప్రతినిధులు అనేక రూపాల్లో తెలియజేస్తున్నామన్నారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే దశల వారీగా ఆందోళన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మీసాల అప్పలరాజు, నేలపు సంతోష్, ఎం కొండమ్మ, ఎన్. గంగాభవాని, ఎం. అప్పన్న, ఎం. ఎల్లమ్మ, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రబీ పంటలు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - కొత్తవలస

ఈ ఏడాది రబీలో వేసిన పంటలను నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి మాధురి శరణ్య తెలిపారు. మంగళవారం దెందేరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రబీ పంట కాలంలో వేసిన అపరాలు, ఇతర పంటలన్నిటికీ గ్రామంలో గల రైతు సేవా కేంద్రాలలో ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. హెచ్‌ఒపి పద్మ మాట్లాడుతూ ఉద్యాన పంటల సస్య రక్షణ వివరాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కోసం రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎన్.దుర్గారావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గజపతినగరం: మండలంలోని శ్రీరంగరాజపురంలో ఎఒ సిహెచ్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. ఎపి సిఎన్‌ఎఫ్ సిబ్బంది మొక్కజొన్నలో పురుగు తెగుళ్ల యాజమాన్యం గురించి వివరించారు. ఎన్‌పిఎస్ఎస్ యాప్ వినియోగించి రైతులు పురుగు తెగుళ్ల నివారణ చర్యలు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఎఎలు వినయ్ కుమార్, జ్యోత్స్న, ఎపిసిఎన్ఎఫ్ సిఆర్‌పి బి.ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: రైతులకు సూచనలు చేస్తున్న ఎఒ పూర్ణిమ

నెల్లిమర్ల: రైతులు రబీలో వేసిన పంటలకు ఈ పంట, ఈకెవైసి చేయించుకోవాలని ఎఒ ఎం.పూర్ణిమ సూచించారు. మంగళవారం కొండగుంపాంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఈపంట నమోదు ఫిబ్రవరి 15 తేదిలోగా చేసుకోవాలన్నారు. అపరాలు, రాగిపంటలను పరిశీలించి సస్య రక్షణ చర్యలు గురించి వివరించారు. ఈ పంట నమోదు చేసుకున్న వారికే ప్రభుత్వ వ్యవసాయ పథకాలు వర్తిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో విఎ ఎ రూపావతి, రైతులు పాల్గొన్నారు.

అందరికీ నష్ట పరిహారమివ్వాలి

ప్రజాశక్తి - గుర్ల

రెండు నెలలు క్రితం వచ్చిన తుపానుకు వరి, మొక్క జొన్న పంట నష్టం జరిగిందనీ, రైతులకు ఎటువంటి నష్టం పరిహారమూ అందించలేదని నష్టపోయిన రైతులందరికీ పరిహారమివ్వాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. కొన్ని ఎకరాలకు మాత్రమే నష్ట పరిహారం వచ్చిందని అధికారులు చెప్పడంతో అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పొట్నూరు ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష చేశారు. పలు శాఖలు అధికారులు తమ శాఖలు ప్రగతి నివేదికలను సభకు చదివి వినిపించారు. ప్రభుత్వం ఇంకా మిగిలి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చూడాలని గ్రామ సర్పంచులు వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ముంజూరైన గోకులాలను సర్పంచులకు తెలియజేసే విధంగా చూడాలని ఎపిఒ కామేశ్వరరావుకు సర్పంచులు సూచించారు. గ్రామ సభలో తీర్మానం చేసిన గోకులాలకు అనర్హులకు ముంజూరు చేయడం విడ్డూరంగా ఉందని పలువురు సర్పంచులు సభ దృష్టికి తెచ్చారు. వీటిపై పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు.

వ్యవసాయాధికారులపై జెడ్‌పి చైర్మన్ ఆగ్రహం

రైతు వివరాలను వెల్లడిస్తున్న ఎఒ తిరుపతిరావు

ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు అధికారులు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులకు, ఇతర ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇస్తూ ప్రోటోకాల్ పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిపి ప్రతినిధి పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు, వైస్ ఎంపిపి తోట తిరుపతిరావు, వైసిపి నాయకులు అంబళ్ల చిన్నారావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, తహశీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపిడిఒ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

సబ్బవరం నుంచి రాయపూర్ వరకు ఆరు వరుసల హరిత రహదారి నిర్మాణం జరుపుతున్న హెచ్‌జి ఇన్ఫ్రా కంపెనీ సమీప గిరిజన గ్రామాల రాక పోకలకు వీలుగా సర్వీస్ రోడ్లు, డైవర్షన్ మార్గాలు ఏర్పాటు చేయాలని గిరిజన గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కొండ కెంగువ హెచ్‌జి ఇన్ఫ్రా కంపెనీ ఆఫీస్ ఎదుట ఆందోళనకు దిగారు. రావువలస మాజీ సర్పంచ్ జయరావ్, ఎనుబరువు చర్చి ఫాదర్ ప్రసాద్ ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలు, యువకులు, ప్రజలు చేరుకుని వెంటనే వారి గ్రామాలకు సర్వీస్ రోడ్లు, డైవర్షన్ మార్గాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అండర్ బ్రిడ్జి నిర్మాణాలు ఇరుకుగా ఏర్పాటు చేయడంతో అటవీ ఉత్పత్తులు జిసిసికి తరలించేందుకు గ్రామాల్లోకి భారీ వాహనాలు, అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనాలు రాలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. వెంటనే అక్కడ వెడల్పు చేసి వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించాలన్నారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని నిర్మాణ సంస్థ మేనేజర్ అంబల్ల రవి కుమార్‌కు అందజేశారు.

పదో తరగతి పరీక్ష మెటీరియల్ పంపిణీ

బొబ్బిలిరూరల్: మెట్టవలస ప్రాథమికోన్నత పాఠశాలలో స్పందన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు రిటైర్డ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ కాజా వేణుగోపాల్ మాట్లాడుతూ తాను చదువుకున్న తన స్వంత గ్రామమైన పాఠశాలలో ఏటా 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తిన్న పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరికి ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.మాధవ, ప్రధానోపాధ్యాయులు విశాలాక్షి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆతవలో కొనసాగుతున్న దీక్షా శిబిరం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆతవ గ్రామానికి వేసిని రోడ్డును మధ్యలో నిలుపుదల చేశారని రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతూ గ్రామస్తులు చేస్తున్న దీక్ష రెండో రోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం చేపట్టి మూడు సంవత్సరాలు పూర్తయినా ఇంత వరకూ నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. గత వైసిపి చేసిన తప్పునే కూటమి ప్రభుత్వం కూడా చేస్తుందన్నారు. రోడ్డు పనులు ప్రారంభించే వరకు నిరసన కార్యక్రమం కొనసాగిస్తామన్నారు. అవసరమైతే ప్రభుత్వ కార్యాలయాలను కూడా ముట్టడిస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమానికి సిపిఎం జిల్లా నాయకులు చల్లా జగన్, వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగ్గుబాబు, మాజీ డిసిసిబి చైర్మన్ వి.వి.చిన్నరామునాయుడు, ఎంకెఆర్‌పురం వైస్ సర్పంచ్ పెదనాయుడు, పాటూరు మాజీ సర్పంచ్ గంగు నాయుడు, ఆతవ సర్పంచ్ గొంప వేమననాయుడు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యమ నేత ఉదయ భాస్కర్, మాజీ సర్పంచ్ బోని నాగరాజు, దప్పు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒకు ఎండిఎం నిర్వాహకుల వినతి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండల కేంద్రంలో ఎంఇఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజనం కార్మికులు మంగళవారం ధర్నా చేపట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు మాట్లాడుతూ హైస్కూల్లో భోజన కార్మికులు 9, 10 తరగతి పిల్లలకు ఊరకనే వండి పెడుతున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్నం భోజన కార్మికుల చేత ఊరకనే పని చేయించుకుని వారికి శ్రమకి తగ్గ జీతాలు ఇవ్వక, వారితో వెట్టి చాకిరి చేయించుకుంటున్నాయన్నారు. హైస్కూల్లో 9,10 తరగతుల పిల్లలకు వంట చేయించుకుని వారి శ్రమను గుర్తించకుండా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వచ్చే నెల 1న హైస్కూల్లో 9,10 తరగతుల పిల్లలకు వంట చేయడం బందు చేస్తామని హెచ్చరించారు. గత డిసెంబరులో కాలేజ్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం పెట్టి, ప్రైవేటు సంస్థ అక్షయపాత్రకు సొమ్ము చెల్లిస్తున్నారని, వారి మీద ఉన్న ప్రేమ మధ్యాహ్నం భోజనం కార్మికుల మీద ఎందుకు లేదని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు సరుకులు, గ్యాస్ ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. మధ్యాహ్నం భోజన కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులకు రూ.10వేలు జీతం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు యు. వెంకటఅప్పలనరస, ఆర్.రామలక్ష్మి, బి.సన్యాసమ్మ, బి.సత్యవతి, కె. సింహాచలం, ఎస్కేపీర్ బిబి, జె రమాదేవి, దేవి వెంకటయ్య పాల్గొన్నారు.

వినతినిస్తున్న ఎమ్‌డిఎం కార్మికులు, నాయకులు

లిఫ్ట్ ఇరిగేషన్‌కు నిధులివ్వాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

తోటపల్లి కాలువపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే బేబినాయన కోరారు. అమరావతిలో సోమవారం సిఎంను కలిసి నియోజకవర్గ సమస్యలను వివరించారు. తెర్లాం మండలం లోచర్ల, బొబ్బిలి మండలం శివడవలస వద్ద తోటపల్లి కాలువపై లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఏర్పాటు చేసి సాగునీరు ఇస్తామని ఎన్నికల్లో రైతులకు హామీ ఇచ్చామని, ఎన్నికల హామీను అమలు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. సాగునీరు రైతులకు సక్రమంగా అందకపోవడంతో పంటలకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బాడంగి మండలం గొల్లాది వద్ద వేగావతి నదిపై వంతెన నిర్మాణం చేస్తామని ఎన్నికల ప్రచారంలో భాగంగా రా..కదలిరా సభలో, టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం సభలో హామీ ఇచ్చినట్లు గుర్తుచేస్తూ, వీలైనంత త్వరగా వంతెనను మంజూరు చేయాలన్నారు. బేబినాయన తీసిన వైల్డ్ లైఫ్ ఫోటోలతో చేసిన క్యాలెండరును చంద్రబాబుకు అందజేశారు.

చంద్రబాబును కోరిన బేబినాయన

సిఎంకు కేలండర్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే

తాగునీటి ప్రాజెక్టు పూర్తికి నిధులు ఇవ్వండి

మున్సిపల్ ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు అందించేందుకు సీతానగరం సువర్ణముఖి నది నుంచి పైపులైన్ పనులను పూర్తి చేసేందుకు నిధులు ఇవ్వాలని పట్టణాభివృద్ధి శాఖామంత్రి నారాయణను ఎమ్మెల్యే బేబినాయన కోరారు. అమరావతిలో మంగళవారం మంత్రిని కలిసి నిధులు ఇవ్వాలని కోరారు. సువర్ణముఖి నది నుంచి పైపులైన్ కోసం ఎఐబిబి నిధులు రూ.2.20కోట్లు మంజూరవ్వడంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి నిధులు చాలవని ఆపేశారన్నారు. పనులుపూర్తి చేసేందుకు నిధులు ఇవ్వాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు.

యువత అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

గ్రామీణ ప్రాంత యువత మత్తు పదార్థాల జోలికి పోవద్దని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు సూచించారు. మండల పరిధిలోని ఆరికతోట గ్రామంలో మంగళవారం సాయంత్రం సంకల్పం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు బానిసకావడం వల్ల కుటుంబాలు నాశనం అవుతాయని, దీనిపై ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాలన్నారు. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణాలో యువత పాలుపంచుకుంటోందన్న సమచారం ఉందని, దీనిపై నిఘా ఏర్పాటు చేశామని, గంజాయితో పట్టుబడితే కఠిన శిక్షలు విధిస్తామని హెచ్చరించారు. మహిళలపై లైంగికదాడులు, అత్యాచారయత్నానికి పాల్పడితే పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ మహిళలకు గౌరవం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాల కారణంగా చాలా మంది డబ్బు పోగొట్టుకొని ఇబ్బందులు పడుతున్నారని, వీటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఫేక్ కాల్స్‌కు ఎవరూ సమాధానం ఇవ్వవద్దని, బ్యాంకుల నుంచి అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే స్పందించవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ అప్పారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.